కొల్లేరుకు పోటెత్తుతున్న వరద నీరు

- పొంగి ప్రవహిస్తున్న నల్లకోడు డ్రెయిన్
- రోడ్డును తాకుతున్న ముంపు నీరు
- గండి పడితే రాకపోకలు బంద్

భీమడోలు: కొల్లేరులోకి వెళ్లే ప్రధాన మురుగు డ్రెయిన్ నల్లకోడు పొంగి ప్రవహిస్తోంది. దిగువకు చేరుకున్న తమ్మిలేరు వరద నీటిని కొల్లేరులోకి తీసుకుని వెళ్లే నల్లకోడు మల్లవరం వద్ద ఉధృతిగా ప్రవహిస్తోంది.ఉధృతిగా వస్తున్న తమ్మిలేరు నీరు నల్లకోడు డ్రెయిన్‌లోకి చేరడంతో ఇక్కడి ముంపు నీరు నల్లకోడు వంతెనకు రెండు అడుగుల దిగువన ప్రవహిస్తోంది. దీనితో ముంపు నీరు మల్లవరం రహదారిని తాకుతోంది. కొల్లేరులోని నీరు 10 అడుగుల వరకు పెరిగింది. దీనితో ఏ క్షణంలోనైనా రోడ్డుకు గండి పడే అవకాశాలు ఉండడంతో ఆ ప్రాంతాల కొల్లేరు వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఏలూరు రూరల్ మండలంలోని పలు గ్రామాల్లోని రహదారులపై నీరు ప్రవహిస్తోంది. మల్లవరం వద్ద రోడ్డుకు గండి పడితే దాదాపు కొల్లేరు గ్రామాలకు రాకపోకలు బంద్ కానున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు కొల్లేరు డ్రెయిన్ల ద్వారా కొల్లేరులోకి చేరుతుంది. కొల్లేరులో డ్రెయిన్లను పూడ్చివేసి అక్రమంగా తవ్విన ఆక్వా చెరువులవల్ల నీరు ఎగదన్నుతోంది. దీనితో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆగడాల లంక, చెట్టున్నపాడు, మల్లవరం, కోరుకల్లు, బద్రికోడు ప్రాంతాల్లో కొల్లేరులోని నీరు వెనక్కి రావడంతో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మల్లవరంలోని పల్లపు ప్రాంతంలో ఉన్న ఎంపీపీ పాఠశాలలోకి నీరు చేరింది. ఆగడాల లంకలోని ఊరకోడు రోడ్డు మునిగిపోయింది.


మల్లవరం రోడ్డును తాకుతున్న వరద నీరు


మల్లవరంలో పాఠశాలలోకి చేరిన ముంపు నీరు


ఆగడాలలంకలో ఊరకోడు రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

మల్లవరంలో అధికారుల పరిశీలన

మల్లవరం ప్రాంతంలోని పొంగి ప్రవహిస్తున్న నల్లకోడు డ్రెయిన్ ఉధృతిని సోమవారం తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి పరిశీలించారు. ఎగువ నుంచి వచ్చే వరద నీటిపై సంబంధిత అధికారులను నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ్మిలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేయడం ఆపితే నీటి మట్టం పెరగదని వారికి స్థానిక అధికారులు వివరించారు. ఇలా కొనసాగితే రోడ్డును నీరు తాకి గండి పడే అవకాశాలున్నాయని తెలిపారు. ఫారెస్ట్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల అధికారులు ఉన్నారు.

లంక గ్రామాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

భీమడోలు: భారీ వర్షాలు కురుస్తున్నందున లంక గ్రామాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. కొల్లేరు గ్రామం చెట్టున్నపాడు శివారు మల్లవరం వద్ద వరద ముంపు నీరు రోజు రోజుకూ పెరగడంతో ఆ ప్రాంతాల ప్రజలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో సోమవారం ఆయన పర్యటించారు. ఉధృతిగా ప్రవహిస్తున్న నల్లకోడును ఆయన పరిశీలించారు. సంబంధిత రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, డ్రెయిన్, ఫారెస్ట్ శాఖ అధికారుల నుంచి ఆయన చర్చించి తగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముంపు నీరు పెరిగితే రోడ్డు ధ్వంసమవుతుందని, ఇదే జరిగితే రాకపోకలు నిలిచిపోతాయని గ్రామస్తులు ఎమ్మెల్యేకు తన గోడును విన్నవించుకున్నారు. రోడ్డు వెంబడి నీరు రోడ్డుపైకి రాకుండా గ్రావెల్‌తో బస్తాలు వేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, ఇరిగేషన్ ఏఈ మాధవరావు, ఈవోఆర్డీ సుందరి, ఫారెస్ట్ సిబ్బంది కృష్ణ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి


మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): బాలికల వసతి గృహంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. స్థానిక అమీనా పేటలోని బాలికల వసతి గృహాన్ని సోమవారం ఆయన సందర్శించారు. బాలికలకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. వసతి గృహంలో మురుగు నీరు అస్తవ్యస్తంగా ఉందని ఇదే పరిస్థితి కొనసాగితే విద్యార్థులకు విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని రత్నప్రసాద్ హెచ్చరించారు. వసతి గృహాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాలికలు చదువుతో పాటు బాలికల సంరక్షణ చట్టాల గురించి అవగాహన పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్లు ఎం గంగాభవాని, కె.సునీత, వసతి గృహం సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లోతట్టు ప్రాంతాల్లో అధికారుల తనిఖీ


కేదవరంలో లోతట్టు ప్రాంత ప్రజలను ఖాళీ చేయిస్తున్న అధికారులు

దెందులూరు: కొల్లేరు వరద నీరు ప్రమాదం బారిన పడకుండా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు సోమవారం దెందులూరు మండల స్పెషల్ ఆఫీసర్ ఎస్.కృపావరం, దెందులూరు తహసీల్దార్ బి.సుమతి లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. రాత్రికి కొల్లేరు వరద నీరు వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తుగా కేదవరంలో లోతట్టులో ఉన్న ఇళ్లకు వెళ్లి వారందరినీ ఖాళీ చేయాలని సూచించారు. స్థానిక కల్యాణ మండపంలో వారికి పునరావాసం కల్పించారు. ఆర్ఐ హేమమాలిని, సర్పంచ్ బోదుల స్వరూప్, వీఆర్వో శ్రీనివాస్, కార్యదర్శి షరీఫ్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వేళాంకణి మాత ఉత్సవాలు


వేగవరం ఆర్‌సీఎం చర్చిలో దివ్య పూజాబలి అర్పిస్తున్న ఫాదర్ డాక్టర్ బాల

దెందులూరు: వేగవరం వేళాంకణి మాత ఉత్సవాల్లో దివ్య పూజాబలి అర్పించడం ఉత్సవాల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ పి.బాల అన్నారు. మండలంలోని వేగవరం ఆర్‌సీఎం చర్చిలో వేళాంకణి మాత ఉత్సవాలు పారీస్ క్రిస్ట్ ఫాదర్ మోజెస్ ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగాయి. వేగవరం టవర్ వద్ద ఏటా ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్న ఫాదర్ మోజెస్‌ను అభినందించారు. అనంతరం ఆయన్ని సత్కరించి జ్ఞాపికను అందచేశారు.

ఫాదర్ డేవిడ్‌కు సత్కారం


పోతునూరు ఆర్‌సీఎం చర్చిలో బదిలీపై వెళ్తున్న ఫాదర్ డేవిడ్‌ను సత్కరిస్తున్న ఉపదేశీయులు

దెందులూరు: పోతునూరు ఆర్‌సీఎం చర్చి పారీస్ క్రిస్ట్ విచారణ పరిధిలోని ఆరు గ్రామాల్లో అందించిన ఫాదర్ డేవిడ్ అందించిన ఆధ్యాత్మిక సేవలు మరువలేనివని పోతునూరు విచారణ ఉపదేశీయులు అన్నారు. పోతునూరు ఆర్‌సీఎం చర్చి పారీస్ క్రిస్ట్ ఫాదర్ డేవిడ్ బదిలీ అయిన నేపథ్యంలో ఆయన్ను ఉపాధ్యాయులు, ఉపదేశీయులు, సంఘ పెద్దలు, సంఘస్తులు, మరియదళ సభ్యులు, సండే స్కూల్ చిన్నారులు, ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందచేశారు.

వరద బాధితులకు వైద్య సేవలు


విజయవాడలో నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్న పెరికె వరప్రసాదరావు

ఏలూరు (టూటౌన్): స్వచ్ఛంద సంస్థల సేవలను వినియోగించుకోవాలని సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు కోరారు. సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని విజయవాడ వరద బాధితులకు సోమవారం నిర్వహించారు. స్థానిక నైజాం గేట్ సెంటర్, వింజపేట, శ్రీ విద్యాంజలి స్కూల్‌లో ఈ క్యాంపు నిర్వహించారు. అన్నిరకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, సుమారు 300 మందికి మందులు పంపిణీ చేశారు. క్యాంపులో వైద్యులు అలేఖ్య, చంద్రిక, వింజపేట మహిళా నాయకురాలు ఎండీ సల్మా సుల్తాన్, మెడికల్ స్టాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

పంట చేల పరిశీలన


పోణంగి ప్రాంతంలో చేలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఏలూరు రూరల్ : ఏలూరు మండల గ్రామాల్లో ముంపుబారిన పడిన పంటచేలను సోమవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఏలూరు డాట్ సెంటర్ నుంచి శాస్త్ర ఫణికుమార్, నాగేంద్రబాబుతో పాటు మార్టేరు వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి టి.సునీత, రోజా, భువనేశ్వరి, రమణరావు, మండల వ్యవసాయ అధికారిణి జీవనసంధ్య పోణంగి, జాలిపూడిలో రైతులను కలిశారు. వరదనీరు తగ్గుముఖం పట్టిన తర్వాత తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

భారీ వర్షాలకు రహదారులు ఛిద్రం

ఉంగుటూరు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదార్లు ఛిద్రంగా మారాయి. ప్రధానంగా లింకు రహదార్లు పరిస్థితి మరీ అధ్వానంగా మారాయి. గ్రామానికి గ్రామానికి మధ్య వర్షాలకు గ్రావెల్ రహదార్లు, మెటల్ రహదార్లు, మట్టి రహదార్లు బురదమయంగా మారాయి. మండలం పరిధిలో సెప్టెంబరు 1 నుంచి 9వ తేదీ వరకు 99.2 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. దీంతో మండలంలో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రధానంగా దళిత వాడలు, జగనన్న కాలనీలో నీళ్లు చేరాయి. బలహీన వర్గాల కాలనీలు, బీసీ కాలనీల్లోకి నీరుచేరింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లింకు రహదార్లు ప్రజలు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. గుళ్లపాడు-చిన్న వెల్లమిల్లి, చింతాయిగూడెం-లంబాడిగూడెం, ఉంగుటూరు తహసీల్దారు కార్యాలయం నుంచి నారాయణపురం వచ్చే రహదారి, తల్లాపురం -చేబ్రోలు రహదారి, కొత్తగూడెం-పాటిమీద, బొమ్మిడి-కాకర్లమడి, కాకర్లమూడి-తోటరాచంద్రపురం, దొంతవరం-సీతారామపురం, ,కాగుపాడు-దేవరకొండేపాడు, ముత్యాలంబపురం-ఉప్పాకపాడు గ్రామాల లింకు రహదార్లు అధిక వర్షాలకు అధ్వానంగా తయారయ్యాయి. దాంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


ఎడతెరిపి లేని వర్షాలకు అధ్వానంగా మారిన నారాయణపురం-ఉంగుటూరు రోడ్డు

అందరూ అప్రమత్తంగా ఉండాలి

దెందులూరు: మండల, గ్రామస్థాయి అధికారులు, ఉద్యోగులు సమష్టి కృషితో ఇప్పటి వరకు భారీ వర్షాలు వరదల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని, రానున్న రోజుల్లోనూ అందరూ అప్రమత్తంగా ఉండాలని దెందులూరు స్పెషల్ ఆఫీసర్ ఎస్.కృపావరం అన్నారు.దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.సుమతి అధ్యక్షతన అధికారులు, ఉద్యోగులతో తుఫాన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. కొల్లేరు వరద నీటితో లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, దెందులూరు సైఫన్, కొవ్వలి మొండుకోడు, సత్యనారాయణపురం గుండేరువాగు వద్ద అధికారుల సమన్వయం, ప్రణాళిక వల్ల ఎటువంటి ప్రమాదం జరగలేదన్నారు. మరో తుఫాన్ పొంచి ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమీక్షా సమావేశంలో గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు ఉన్నారు.


తుఫాన్ సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న స్పెషల్ ఆఫీసర్ కృపావరం

లంక గ్రామాల ప్రజలను ఆదుకోవాలి

ఏలూరు రూరల్ : ముంపుబారిన పడిన కొల్లేరు ప్రజలను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జిల్లా కార్యవర్గ సభ్యుడు డీఎన్‌వీడీ ప్రసాద్, పి.కిషోర్, కె.శ్రీనివాస్, పీవీ రామకృష్ణతో పాటు ప్రసాద్, పి.కిషోర్ తదితరులతో కలిసి కొల్లేరు గ్రామం మాదవాపురాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వర్షాలు, వరద తాకిడికి కొల్లేరు గ్రామాల ప్రజలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లేరు నడిబొడ్డులో చిక్కుకుపోయిన ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ముంపుబారిన పడిన లంకగ్రామాల ప్రజలకు తాగునీరు, నిత్యావసర సరుకులు, మందులు ప్రభుత్వమే ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. రోడ్లు మునిగిపోవడం వల్ల ప్రజలతో పాటు ఆక్వా రైతులు సైతం ప్రమాదకర స్థితిలో వరదలో పయనిస్తున్నారని అన్నారు. సులువుగా రాకపోకలు సాగించేందుకు బోట్లు ఏర్పాటుచేయాలన్నారు.


మాదవాపురం వద్ద కొల్లేరు వరద ఉధృతిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నిత్యావసర సరుకుల పంపిణీ

ఏలూరు రూరల్ : కలకుర్రు గ్రామస్తులకు అధికారులు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆర్డీఓ ఎస్ఎస్‌కే ఖాజావలితో పాటు ఎంపీడీఓ బి.ప్రణవి తదితరులు గ్రామానికి చేరి ముంపు పరిస్థితిని పరిశీలించారు. వరద ముంపు తగ్గేవరకు జాగ్రత్తగా ఉండాలని ఆర్డీఓ ప్రజలకు సూచించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ, సహకారం అందిస్తుందని తెలిపారు. వరద ప్రభావం తగ్గే వరకూ కాచి చల్లార్చిన నీటి తాగాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

భీమడోలు: పాఠశాలల ఆవరణాలు పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహాం అన్నారు. పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినీ పేడాడ మీనాక్షి ఆనారోగ్య కారణాల మృతి చెందిన విషయం అందరికి తెలిసిందే. దీనిపై బాలిక మృతికి గల కారణాలపై తగు నివేదిక సమర్పించాలని డీఈవోను జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వీ ఆదేశించారు. పూళ్ల ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు, ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్‌తో కలిసి పరిసరాలను పరిశీలించారు. బాలిక మృతికి గల కారణాలను సంబంధిత పూళ్ల వైద్య ఆరోగ్యశాఖ వైద్యుల నుంచి వివరాలు సేకరించారు. విద్యార్థిని దీర్ఘకాలిక అనారోగ్య కారణాలతో మృతి చెందిందని, డెంగీ జ్వరంతో కాదని వైద్యులు రాతపూర్వకంగా సమాచారం అందించారు. అనంతరం పరిసరాలు, తరగతి గదులు, టాయిలెట్స్ ప్రాంతాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షాల పాఠశాల ఆవరణంలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని సంబంధిత హెచ్ఎం పి.భువనేశ్వరరావును ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ప్రతి పాఠశాలలోని తరగతి గదులు, వంట గదులను, ఆట స్థలం ప్రాంగణాలను శుభ్రం చేయాల్సిన బాధ్యత ఆయాలపై ఉందన్నారు. వర్షాల వల్ల వరసగా సెలవులు వచ్చినందున తరగతి గదులను పరిశుభ్రం చేసుకోవాలని, మంచినీటి విషయంలో శ్రద్ధ వహించాలని, ఎండీఎం వంట తయారు చేసే ప్రాంతాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు.


పూళ్ల ఉన్నత పాఠశాలలోని పరిసరాలను పరిశీలిస్తున్న డీఈవో ఎస్.అబ్రహం

వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు


గోపన్నపాలెంలో బాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో వినాయకుని పూజిస్తున్న చిన్నారులు


భీమడోలులో నీలం వర్ణం భక్తులకు దర్శనమిచ్చిన శ్రీమన్మహాగణనాథుడు

దెందులూరు: మండలంలో గ్రామ గ్రామాన వినాయక చవితి ఉత్సవాలు వర్షంలో అంగరంగ వైభవంగా కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. గోపన్నపాలెం బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో చిన్నారులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. చల్లచింతలపూడిలో చిన్నారులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. దెందులూరు, పోతునూరు, కొవ్వలి, సోమవరప్పాడు, గంగన్నగూడెం, శ్రీరామవరం, రామారావుగూడెం, పెరుగ్గూడెం గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించారు.

ఘనంగా గణేశ్ విగ్రహాల నిమజ్జనాలు

భీమడోలు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజైన సోమవారం గణేశ్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, పోలసానిపల్లి, సూరప్పగూడెం, లంక గ్రామాల్లోని ఉత్సవ కమిటీ నిర్వాహకులు గణనాథుని విగ్రహాలను ట్రాక్టర్‌పై ఉంచి తీన్‌మార్ డప్పు వాయిద్యాలతో వీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భీమడోలులోని అరుంధతీ కాలనీకి చెందిన వినాయకుని విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఊరేగించారు. అనంతరం విగ్రహాలను గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు. భీమడోలులోని శ్రీమన్మహాగణనాథుని 60వ వార్షికోత్సవాల్లో భాగంగా మూడో రోజు గణనాథుడు నీలం రంగులో భక్తులకు దర్శనమిచ్చారు.

బలమైన ఆహారం తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): గర్భిణులు, బాలింతలు బలమైన ఆహారం తీసుకోవాలని డాక్టర్ శశాంక్ అన్నారు. స్థానిక 39వ డివిజన్ పరిధిలోని కొత్తపేట యూహెచ్‌సీలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం మౌనిక ప్రియాంక అధ్యక్షతన సోమవారం పోషికాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శశాంక్ మాట్లాడుతూ గర్భిణులు బలవర్ధకమైన ఆహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వగలరని తెలిపారు. రక్తహీనత బారిన పడకుండా ఉండాలని సూచించారు. హెచ్‌వీ సీహెచ్ మార్తమ్మ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేసినట్టు కమిషనర్ ఎ.భానుప్రతాప్ తెలిపారు. కృష్ణ కాలువ, తూర్పులాకుల వద్ద, మినీ బైపాస్‌రోడ్డులో నిమజ్జనాలకు ఏర్పాట్లు చేశామన్నారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

పెదపాడు: వరద ప్రాంత ప్రజలను, రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రవి కోరారు. సోమవారం పెదపాడు మండలంలోని గోగుంట వసంతవాడ వరద ప్రాంత గ్రామాల్లో సీపీఎం జిల్లా నాయకుల బృందం పర్యటించింది. గోగుంట ఎస్సీ కాలనీలో ప్రతీ ఇంటికి వెళ్లి వరద బాధితులను పరామర్శించి నష్టం వివరాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వసంతవాడ హైస్కూల్లో వరద బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరద నీరు చేరడంతో ఇంటి సామాగ్రి అంతా పాడైపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏ రవి మాట్లాడుతూ వరద ప్రాంతాల్లో ప్రజల ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బుడమేరు వరద ఫలితంగా ప్రజలు రైతులు తీవ్రంగా నష్ట పోయారని చెప్పారు. వరద వల్ల జరిగిన నష్టాన్ని ప్రభుత్వం త్వరితగతిన అంచనా వేసి బాధితులకు పూర్తిస్థాయి పరిహారం చెల్లించాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు కె శ్రీనివాస్, పీ రామకృష్ణ, గుండపనేని సురేష్, షేక్ కరీముల్లా పాల్గొన్నారు.



పెదపాడు: గోగుంటలో నిర్వాసితులకు దుస్తులు, పండ్లు అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

వరద బాధితులకు దుస్తుల పంపిణీ

వరద బాధితులకు జిల్లాలోని ఏపీయూటీఎఫ్ నాయకులు చీరలు, ప్యాంట్, షర్టులు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర యూటీఎఫ్ నాయకులు ఆదేశాల మేరకు జిల్లా నాయకులు ఇటీవల వరదలో నిర్వాసితులైన వారిని ఆదుకోవాలని ఉపాధ్యాయుల నుండి సేకరించిన దుస్తులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తాఫావలీ, రవికుమార్ రుద్రాక్షి, రాష్ట్ర కార్యదర్శి బి సుభాషిణి, జిల్లా కోశాధికారి జీ వీ రంగమోహన్, జిల్లా కార్యదర్శి కె కమల్‌కుమార్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బి మోహనరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు తేరా ప్రసాద్ పాల్గొన్నారు.

విరాళాలు అందజేత

ఉంగుటూరు: వరద బాధితుల సహాయార్థం పలువురు దాతలు విరాళాలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు సోమవారం అందజేశారు. నారాయనపురం సమతా గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోషియేన్ వారు రూ.లక్ష నగదును వేగేశ్న సత్యానారాయణ, నెక్కలపూడి సత్యనారాయణ కలిసి ఎమ్మెల్యేకు అందజేశారు. ఉంగుటూరుకు చెందిన ఎన్ఆర్ఐ కొండ్రెడ్డి శేషసాయి రూ.80 వేలు అందజేశారు. రామచంద్రపురానికి చెందిన గౌతు రామచంద్రరావు రూ.10 వేలు అందజేశారు. చేబ్రోలు వెల్ఫేర్ టీము సభ్యులు రూ.37,367 చెక్కును అందజేశారు.